



ఆకస్మికంగా ఆ ఊరికి వచ్చిన మృత్యుంజయు డెవరు? అతని పూర్వగాథ ఏమిటి ?

ఆ వూళ్లో ఎవరి నోటివెంట చూసినా, విన్నా అవే పలుకులు, అవే మాటలు—"వింతమనిషి, వింతపశువు .... దేవుడు .... కాదు .... దయ్యం". ఈ మాటలు అనుకునేటపుడు వాళ్ళు పొందే ఆశ్చర్యం ఎవరికీ అంతుపట్టదు. అసలే అది పల్లె టూరు .... గోరంత వింతైనా కొండంత వింతై వక్కే .... అదే ఇక కొండంత వింతైతే ...."

* * *

"ఈ వూరుకు కీడే ప్రాప్తించిందో, మేలే ప్రాప్తించిందో గాని, మరీ మరీ విడ్డూరాలు విరుచుకు పడుతున్నాయి. ఉన్న విడ్డూరం చాలదూ ? యీ మరో విపరీతం కూడా కలిసిరావాలా? ఊసుపోని వాళ్లందరికీ నోరు దురదతీరేదాకా మాట్లాడుకోడానికీ మూలాపు విషయాలు దొరికాయి" అన్నాడు మునసబు కరణంతో.

కరణం తాపీగా చుట్ట ముట్టిస్తూ, "లోక మండీ, నానాటికీ తెలుగుమీరుతోంది. 'రంపాలు' మొదలు 'రాకెట్లు' వరకూ కనిపెట్టారు. బుర్రలు తీసి బుర్రలు మారుస్తున్నారు. బుర్రలు లేకుండా కూడా మనిషి ఉండేలా రేపోమాపో కనిపెడ్తారు ... సైన్సు .... సైన్సండీ" అన్నాడు తన విజ్ఞానాన్ని ప్రదర్శిస్తూ.

"బుర్ర లేకుండా మనిషిని కనిపెట్టడం ఎందుకు ? ఉన్నదంతా (బుర్రలు) లేనిసరుకేగా ?" అన్నాడు మునసబు చుట్టపొగ వదులుతూ.

ఇంతలో ఒక సరికొత్తకారు ఆ వైపునుంచి దూసుకుపోయింది. కరణం కారులోకి తొంగి చూశాడు. మునసబు 'హ్హ' అంటూ ఓ నిశ్వాసాన్ని బయటకి 'తల' వంచుకున్నాడు.

"మీ రెన్నైనా అనండి, కానీ, నాకు అతన్ని చూస్తే జాలివేస్తోందిగాని, అసహ్యం పుట్టటం లేదండి."

మునసబు ఆ మాటలకు ఇబ్బందిగా ముఖం పెట్టాడు. "అవునవును...డబ్బున్న పిచ్చివాళ్లని చూస్తే అలాగే అనిపిస్తుంది. అదే డబ్బులో మజా" అన్నాడు బొటనవ్రేలును 'టకటక' లాడిస్తూ.

"ఎబ్బె ! అలా అనకండి. అతన్ని చూస్తే నామటుకు నాకు అతనో యుగపురుషుడేమో అనిపిస్తుంది. మనిషి ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్న వాడిలా ఉంటాడు. నా అన్నవాళ్ళు ఎవరూ లేరట! పాపం .... పలకరిస్తే ఎంత మర్యాదయిచ్చి మాట్లాడుతాడో తెలుసా ? మీ రెన్నడూ అతని బంగళాకు వెళ్ళలేదుకదూ .... " అన్నాడు కరణం. మునసబు 'లేదు' అన్నట్లు తల ఊపాడు. కరణం 'ఫకాల్' మని నవ్వుతూ 'అద్దీ! అల్లా చెప్పండి. రేపోసారి .... రేపటిదాకా ఎందుకు? ఈ రాత్రికి నేను వెళ్తున్నాను. నాతో రండి, మీకే తెలుస్తుంది." అన్నాడు.

"ఎబ్బె ! ఇవాళ రాత్రి కుదరదు. వాడొకడు వచ్చాడుగా, వింతపశువు. మన ప్రాణంమీదికి రాత్రికి ఇక్కడకు వస్తాడుట. వింతలు కావాలట. రాసుకు పోతాడట. పిచ్చి వేషాలూ, వెర్రి వేధవలూ" మునసబు విసుగ్గా ముఖంపెట్టాడు..

"మరేట ! అదేం వెర్రండీ ? దస్తాలు దస్తాలు అలా అన్నివిషయాలూ రాసి ఏం చేస్తాడు ?"

"ఏం చేస్తాడు ? తలగడ దిళ్లకు బదులు ఉపయోగిస్తాడు. మరీ ఎక్కువయితే వరుపులకు బదులుకూడా ఉపయోగిస్తాడు" అన్నం ఎక్కువైతే అజీర్తి, డబ్బెక్కువైతే వికారం" అని పెద్దలు ఉత్తినే అన్నారా ?"

"బాగా చెప్పారు" అంటూ కరణం లేచి నిలుచున్నాడు.

"రాత్రికి రండి. వాడికేవో, చెప్పితే ఆ పని అయిపోతుంది" అన్నాడు మునసబు. కరణం 'అలాగే' అంటూ వెళ్లిపోయాడు.

* * *

కారు అనేక మలుపులు తిరిగి ఊరు చివరకు చేరుకుంది. మృత్యుంజయుడు కారు దిగి పొలాల కేసి నడక ప్రారంభించాడు. వెన్నెల నీటులో అతని పచ్చనిశరీరకాంతి ద్విగుణీకృతం అయింది. అతను పొలాల గట్లవెంట నడిచి చెరువుగట్టు మీద కూర్చున్నాడు. అతనిశరీరసౌందర్యానికీ, మానసికసౌందర్యానికీ పొత్తు లేదు. ఆ సమయంలో ఎవరైనా వరే అతని ముఖంలోకి నిశితంగా చూస్తే "మూర్తీభవించిన నిస్పృహ" అని అనితీరాలి.

మృత్యుంజయుడు వెల్లకిలా పడుకుని తల క్రింద రెండుచేతులూ పెట్టుకున్నాడు .... అతని కళ్ళు ఆకాశం వంక చూడసాగాయి .... "ఆకాశం అనంతం, సాగరం అనంతం .... వీటి రెంటికీ ఎంత పోలిక ? మేఘరహితమైన ఆకాశం నీలం, సముద్రం నీలం .... రెండూ అనంతాలే .... సముద్రంవంక చూస్తే—ఆకాశం సముద్రం కలిసినట్లు అనిపిస్తుంది. కానీ అవి కలవవు. ఎన్నడూ కలవవు. అవి కలవడం ఎంత అసంభవమో, నా జీవితం దాని అంతం అంత అసంభవా లేమో ! ఎందు కీ వ్యర్థజీవితం ? ప్రాయశ్చిత్తం లేని పశ్చాత్తాపం ఎందుకూ కొరగాదు... అనవసరమని మథన పడేవాళ్లకు జీవితం అనంతం .... పిసినారివాళ్లకూ, ఆలాటివాళ్లకూ, బ్రతుకుదామని ఆశపడేవారికీ అది అసంభవం .... ఇది యింతే. 'పాపీ చిరాయువు' అన్నారు పెద్దలు. 'పాపీ చిరాయువు' అతను తనలో తను గొణుక్కుంటూ

(87-వ పేజీ చూడండి)

నవ్వుకున్నాడు. చూపులు గగనాన్నుంచి, గుబ్బ (చెరువుగట్టు)కు మళ్లించాడు. చెరువులో గొడ్లను కడుగుతున్న గొడ్లకాపరిని అతనికళ్లు చూశాయి. ఆ గొల్లవాడు తనలో తనే ఏవో పాటలు పాడుకుంటూ ఆనందిస్తున్నాడు. తనకేసి చూస్తున్న వాళ్లకేసికూడా చూడనంత తన్మయత్వంలో మునిగిపోయాడు. మృత్యుంజయుడు అతనికేసి ఆప్యాయంగా చూడసాగాడు. పాడుకుంటున్నవాడల్లా ఆ గొల్లవాడు మృత్యుంజయుడు తనకేసి చూడడం చూసి "దండాలు బాబూ" అన్నాడు. మృత్యుంజయుడు చిన్నగా నవ్వాడు. ఇంతలో ఆ గొల్లవాడు "బాబూ, పాము, తొలగండి" అని అరుస్తూ నీళ్లల్లోంచి ఖంగారుగా ఇవతలకు పరిగెత్తాడు. మృత్యుంజయుడు చివాలున లేచాడు. కాని తాచు పాము అతని చేతిమీద కరచింది. గొల్లవాడు కెవ్వున కేకవేసి కళ్లు మూసుకుని ఒక్క క్షణం తర్వాత తెరిచాడు. అతనికళ్లకు మృత్యుంజయుడు నవ్వుతూ కనిపించాడు. గొల్లవాడి కళ్లు ఆశ్చర్యంతో గిరగిరలాడాయి. "బాబుగారూ, బాబుగారూ" అంటూ అతన్ని సమీపించాడు. మృత్యుంజయుడు చిన్నగా నవ్వి "ఏం ? చచ్చిపోయి ఉంటాననుకొన్నావా ?" అన్నాడు. అంతలో అతని నవ్వు మాయమయి ముఖంనల్లబడిపోయింది. "నేను అంత తేలికగా చచ్చేటంత అదృష్టవంతుణ్ణి కాదు" అని చకచకా కారుకేసి నడక ప్రారంభించాడు.

*　　*　　*

మునసబుగారి ఇంటి అరుగుమీద ముగ్గురు కూర్చుని ఉన్నారు. వాళ్లు మునసబుగారూ, కరణం, కొత్తగా ఆవూరు వచ్చిన వ్యక్తి. ఆ కొత్త వ్యక్తి తన వివరాలు చెప్ప ప్రారంభించాడు.

"నాపేరు రాఘవేంద్ర. నేను సైకాలజీ,అంటే మనిషితత్వం, మనోధర్మంమీది శాస్త్రాలు ఆమూలాగ్రంగా చదివి అన్ని డిగ్రీలూ పొందాను వాటిని విడమర్చి ప్రయోగాలుచేసి చరిత్రకు, అద్భుత సంఘటనలకూ వాటి ఉనికికీ కల సంబంధాలు నిరూపించాలని నా ఊహ. అందుకనే అద్భుత సంఘటనలకోసం ప్రతి ఊరూ తిరుగుతున్నాను. ఈ పనికోసమే వివాహాది ప్రతిబంధకాలు మానుకున్నాను. వాటిని వదులుకున్నాను గూడ."

"అయితే మీరు కనుక్కున్న విశేషాలు ఏవిటంటారు ?" అన్నాడు కరణం. ఆ ప్రశ్నకు రాఘవేంద్ర పొసవదనుడై ప్రారంభించాడు.

"దయ్యాలు, పిశాచాలు, వాటిని గూర్చి ఆమూలాగ్రం చదివాను. అవి ఉన్నాయని నిరూపించాను. ఆ విషయాలు రాసి గ్రంథంగా తయారుచేశాను."

"దయ్యాలు ఉన్నాయంటారా ?" కరణం అడిగాడు.

"ఆహా ! మహారాజుల్లా ఉన్నాయి. మంచిని చేసే భగవంతునికి ఉనికి ఎంత నిర్వివాదమో, చెడును చేసే దయ్యాలు, పిశాచాలూ. వాటి ఉనికి అంతా నిర్వివాదం" అని ఆగాడు.

ఇంతలో మృత్యుంజయుని కారు అటునుంచి వెళ్లింది. ముగ్గురూ ఆ కారుకేసి చూశారు. 'ఇదీ ఇదండీ, ఈ ఊళ్లో వింత" అన్నాడు మునసబు

# క్షమాహంతుడు

(9-వ పేజీ తరువాయి)

గారు కారు వెళ్లినవైపు చెయ్యి చూపిస్తూ. రాఘవేంద్ర నవ్వి "ఇలాటివి వింతలు కావు. మీ ఊళ్లో కారు మీకు వింత అవ్వచ్చు. కాని దేశానికి వింతకాదు." అన్నాడు. మునసబు మీసాలు సరిచేసుకుని నవ్వాడు. "భలే తెలివిగలవాడివయ్యా ! వింత 'కారు' కాదు, కారులోని మనిషి" అన్నాడు. రాఘవేంద్ర సర్దుకుని కూర్చుంటూ "ఏవిటి ! చెప్పండి ! చెప్పండి" అన్నాడు. మునసబు చుట్ట పారేసి పక్కనున్న చెంబుడు మంచినీళ్లు త్రాగి ప్రారంభించాడు.

"ఈనాటికి ఖచ్చితంగా ఏడు సంవత్సరాల క్రితం ఈ ఊళ్లో "నారాయణ" అనే లక్షాధికారి ఒక భవనం కట్టించుకుని పట్నంలో పోగు

---

పత్రికా విలేఖరులు అంతా లండన్‌లో కలిసి నప్పుడు జరిగింది ఇది. అందు ఒకరు, ఎదురుగుండా వస్తున్న మరి వకరిని ఉద్దేశించి: "అవివేకులకు నేను దారియివ్వను" అని చేతులు జాపి నడుస్తుంటే ఎదుటి విలేఖరి "కాని, నేనుమాత్రం అవివేకులకు దారియిస్తాను." అని ప్రక్కకు తప్పుకొన్నాడు.

సి. సత్యనారాయణమూర్తి
(విజయనగరం)

---

చేసుకున్న డబ్బంతా అందులో జారేసుకున్నాడు. నిశ్చింతగా నాలుగు సంవత్సరాలు ఉన్నాడు. తర్వాత మకాం మార్చేశాడు. ఆ భవనం మాత్రం తాళాలు వేసిఉంది. తర్వాత యివాల్టికి నికరంగా ఇరవై రోజులనాడు ఆ 'నారాయణ' ఇంకో నరుణ్ణి తీసుకొచ్చి ఆ భవనం అతనికి అమ్మేశాడు. ఆ నరుడే మృత్యుంజయుడు. అతడు కడు ధనవంతుడు..... కుర్రాడే .... పాతికే ళ్లుంటాయి .... కానీ ఎప్పుడూ దయ్యం పట్టినవాడిలా ఉంటాడు....మాట్లాడడు. మాట్లాడించినా ఎక్కువ మాట్లాడడు. ఈవూరు ప్రజ అతన్ని పిచ్చివాడన్నారు. మరికొందరు దేవుడు అన్నారు...కరణంగారూ 'దేవుడే' అంటారు... అనాటినుండి ఒక్కడే ఉంటున్నాడు. నా అన్నవాళ్లెవ్వరూ లేరట. ఆ మేడలో చేరిననాడు నాలుగైదువేలు పెట్టి యీ ఊరు వూరంతకీ పార్టీ చేశాడు. అనాటినుండి ఎవరు అడిగితే వాళ్లకు దానం అంతో, యింతో చేస్తున్నాడు ... అంతే..."

"ఆ ! ఇంతకన్నా వింతలు నేను ఇన్ని చూశాను" అంటూ రాఘవేంద్ర తన జుట్టు గుప్పెడు దొరకబుచ్చుకున్నాడు. కరణం, మునసబులు ఒకళ్ల ముఖాలు ఒకళ్లు చూసుకున్నారు.

"...ఒకవూళ్లో ఒక చదువుకున్నవాడు ఉన్నాడు. అతనికి భార్యకూడా ఉంది ... అతనికి ఒక జబ్బు ఉండేది...రాత్రి నిద్దరలో లేచేవాడు, నడిచేవాడు, పాడేవాడు, పరిగెత్తేవాడు .... అయితే ఈ విషయాలన్నీ నిద్రావస్థలోనే జరిగేవి. తెల్లారి ఈ విషయాలు ఎవరిద్వారానైనా వింటే అతను ఆశ్చర్యపోయేవాడు. అతను ఒకనాడు తన భార్యను —నిద్రావస్థలోనే సుమండీ—పీక నులిపి చంపేశాడు. చివరిఘట్టంలో అతనికి మెలకువ వచ్చింది. తను చేసిన ఘోరకృత్యాన్ని చూసి చకితుడై వెంటనే ఆత్మహత్య చేసుకున్నాడు."

కరణం, మునసబులు అతని కథను ఆశ్చర్యంతో విన్నారు. ఈలోగా గొల్లవాడు వచ్చి మృత్యుంజయుడికి పాము కరచిన సంగతీ, అతను చావకుండా ఉన్న సంగతీ, ఆయాసంతోకూడిన ఆశ్చర్యంతో చెప్పాడు. "ఇది మరీ వింతగా ఉందే ? పాము కరచినా నాకేం అని ఉండడం...వింత" అన్నాడు కరణం ఆశ్చర్యంతో. ఆ మాటలకు రాఘవేంద్ర ఫకాలుమని నవ్వి "మ్హా .... యింతకన్నా వింతలు సవాలక్ష ఎరుగుదును" అన్నాడు. అతని మాట ఎవరూ వినలేదు.

"ఆయన్ని చూసినట్లు ఉంటుంది. వెళ్దాం వస్తారా ?" అన్నాడు కరణం ఇద్దర్నీ ఉద్దేశించి. 'ఆహా' అన్నారు. ముగ్గురూ బయల్దేరారు.

*　　*　　*

కారు దిగి మేడ ఎక్కిన మృత్యుంజయుడు చివరికి బూట్సయినా విప్పకుండా మంచంమీద పడి ఏడుపు ప్రారంభించాడు.

"ఎందు కీవ్యర్థజీవితం ? ఎవరికోసం ఈ బ్రతుకు ? ఏ ఘనకార్యం చేయడానికి ? నేను ఎందుకు బ్రతకాలి ? ఎలా చావాలి ? పశ్చాత్తాపానికికూడా ఈ లోకంలో ప్రాయశ్చిత్తం లేదా ? ఒక్క ప్రాణి హృదయఘోష మరో ప్రాణిని ఇంత నిర్దయగా శపించగలదా ? ఇది ప్రపంచంలో చాలాచోట్ల జరుగుతుందా ?"

మృత్యుంజయుడు ఆవేశంతో తల మంచంకోడు కేసి బాదుకున్నాడు. తల పగిలి నెత్తురు కారింది. మంచంమీద కూర్చుని ఆరాటావేశాలతో రొప్పసాగాడు. ఇంతలో తలుపు చప్పుడయింది. 'ఎవరది ?' అని అరిచాడు. తలుపవతలనుంచి నౌకరు పిరాస్వామి. "నేను బాబూ — కరణంగారూ, మునసబుగారూ, ఇంకెవరో మిమ్మల్ని చూడాలని వచ్చారు" అన్నాడు. ఆ మాటలకు మృత్యుంజయుడు అదిరిపడ్డాడు. ఓ క్షణకాలం అలానే ఉండిపోయి "వస్తున్నానని చెప్పు" అన్నాడు. నుదురుమీద కారుతున్న రక్తాన్ని రుమాలుతో చకచకా తుడుచుకుని, జుట్టు వెనక్కుతోసుకుని తలుపు తీసుకుని క్రిందకు వచ్చాడు. మృత్యుంజయుణ్ణి చూసి ముగ్గురూ లేచి నించున్నారు. 'కూర్చోండి' అనేసి అతను కూర్చున్నాడు. అతని ముఖం ఎర్రగా ఉబ్బిపోయి ఉంది. కళ్లు ఎర్రబడి ఉన్నాయి. బట్టలు నలిగిపోయాయి. జుట్టు

ముచ్చెమటలతో ముర్ఛపడి ఉన్నాడు రాఘవేంద్ర కంగారుతో అటూఇటూ పరుగెత్తాడు. మేడ మీంచి ఆ వృద్ధుడూ, ఆ అమ్మాయీ దిగివచ్చి ఉపచారాలు చేశారు. కొద్ది నిముషాలకు మృత్యుంజయుడు కోలుకొని ఎదురుగా ఉన్న రాఘవేంద్రను చూసి "ఇలాంటి విషయాలు చెప్పి నా మనసును పాడు చెయ్యకండి" అన్నాడు కటువుగా. "క్షమించండి" అని రాఘవేంద్ర లేచి వెళ్ళిపోయాడు. మృత్యుంజయుడు తనలో తనే ఏదో గొణుక్కుంటూ మేడమీదికి వెళ్ళిపోయాడు.

* * *

మృత్యుంజయుడు ఎవరినో పిల్లని మరో మునకాడిని తెచ్చాడన్న విషయం ఆఘ మేఘాలమీద ఆ వూరంతా పాకిపోయింది. రాఘవేంద్ర తిన్నగా మునసబుయింటికి వెళ్ళాడు. మునసబు కరణాలకు "ఆ విషయం" తనపోటితో చెప్పాడు. ఆ సంగతి విన్న కరణం కొందరు కొందరు కొన్ని కొన్ని సంగతులు వినలేరు. మనస్సు చాలా సున్నితం అయివుంటే వినలేరు. ఘోరాన్ని చూడలేరు" అన్నాడు రామవేంద్ర. మునసబు కొనన్నాడు.

"అయితే ఆ పిల్లా, పిల్లాడూ, అదే .... మునకాడూ ఎవరు ?" అన్నాడు రాఘవేంద్ర తల విగరేస్తూ.

"ఏమో ! రేపిపాటికి తెలియదా ?" అన్నాడు మునసబు.

"అలాకాదు. మనం వెళ్ళి తెలుసుకుందాం. ఇందులో తప్పేంలేదు. తప్పంటే ... అతను చేసిన వాంట్లోనే ఉండాలి, కానీ, మనం వెయ్యబోయే వాంట్లో ఏం ఉండదు" అన్నాడు రాఘవేంద్ర. కరణం, మునసబులు పాలోచనగా ఒకళ్లముఖాలు ఒకళ్ళు చూసుకున్నారు.

"సాయంత్రం వెళ్దాము. ఇప్పుడు వెళ్ళితే బాగుండదు. అనుమానించిన ట్లుంటుంది" అన్నాడు, కరణం ఆ ఇద్దర్నీ ఉద్దేశించి. వా రిద్దరూ కూడా 'ఊ' వన్నారు

* * *

సాయంత్రంకన్నా పెందరాళే జయుల్దేరి ముగ్గురూ మృత్యుంజయుడి ఇంటికి చేరుకున్నారు. లోపలకు వస్తూనే ఎదురుగా సోఫాలో కూర్చున్న వ్యక్తిని చూస్తూ "అరే ! జానకి రామయ్యా ! మీరా" అని కరణం మునసబులు ఏకకంఠంతో ప్రశ్నించారు. ఆ వ్యక్తి లేచి "రండి రండి" అన్నాడు. వాళ్ళు ముగ్గురూ కూర్చున్నారు. ఇంతలో మృత్యుంజయుడు కూడా నవ్వుతూ వచ్చి కూర్చున్నాడు. రెండు క్షణాలు నిశ్శబ్దంగా గడిచాయి.

"మీకు జానకిరామయ్యగారు తెలుసా ?" అన్నాడు కరణం నిశ్శబ్దాన్ని సరిపి చంపేస్తూ.

మృత్యుంజయుడు ముచ్చటగా నవ్వాడు. "నేను మొన్న రాత్రి కారు డ్రయివు చేసుకుంటూ వెళ్నానా ? వెళ్ళివెళ్ళి తిన్నగా ఈయనమీద పెట్టేను..." మృత్యుంజయుడు తను చెప్పటం మాని జానకిరామయ్య కేసి చూపు మళ్ళించాడు. జానకిరామయ్యగారు 'అవును' అంటూ కాలుకు కట్టుకున్న కట్టు చూపించాడు. మృత్యుంజయుడు మళ్ళా ప్రారంభించాడు.

".... ఆ వెంటనే ఆయన్ని కారులో ఎక్కించి ఆయన యింటికి తీసుకువెళ్ళాను. 'ఆ' ఇంటికి తీసుకుని వెళ్ళడంవల్ల—నాకు ఒక మేలు జరిగింది" అతను ఒక్క క్షణం ఆగి .... "వారి అమ్మాయిని నేను వివాహం చేసుకుంటున్నాను" అన్నాడు. జానకి రామయ్యకూడా అవును అన్నట్లు తల ఊపాడు.

"చాలా మంచిది. ఆ సలహా నేనే ఇద్దామనుకున్నాను" అన్నాడు కరణం.

తర్వాత కాస్సేపు లోకాభిరామాయణం చెప్పుకుని ముగ్గురూ లేచి "మేం వస్తామండి" అన్నారు. రాఘవేంద్ర మృత్యుంజయుణ్ణి సమీపిస్తూ "ప్రొద్దున్న జరిగిన విషయానికి నేను చాలా విచారిస్తున్నాను" అన్నాడు. ఆ మాటలు వినేసరికి మృత్యుంజయుడిముఖంలో నవ్వు నామరూపాలు లేకుండా పోయింది రెండు నిముషాల పాటు తల వంచుకుని అలానే ఉండిపోయి తర్వాత "ఫరవాలేదు లెండి" అనేసి చకచకా మేడ మీదికి వెళ్ళిపోయాడు. అతని వింతప్రకృతికి అందరూ ఆశ్చర్యపోయారు.

* * *

వివాహం వైభవంగా జరిగింది. ఊరువూరంతా "మృత్యుంజయునివివాహం మృత్యుంజయుని వివాహమే" అని పొగిడారు విచారరేఖలతో చిక్కుకున్న మృత్యుంజయునిముఖాన పులుముకున్న సంతోషరేఖలు చూసి వీరాస్వామి ఆనందించాడు



చూస్తూ చూస్తూ ఉండగానే, 'చూస్కో నాకేం' అన్నట్లుగా ఓ వారం వెళ్ళిపోయింది.

* * *

ఆవేళ ఆదివారం. సాయంత్రం నాలుగు గంట అయ్యింది. మృత్యుంజయుడు మేడమీద భార్యతో కబుర్లు చెబుతున్నాడు. అతను ఎటో చూస్తున్నాడు. ఆమె అతనికేసి చూస్తోంది. చూసిచూసి "ఏవిటి? ఆలోచిస్తున్నారు ?" అంది. మృత్యుంజయుని ఆలోచనకు ఆమాట అంతరాయం కలుగజెయ్యలేకపోయింది. ఆమె మళ్ళా అవేమాటలు అంటూ భర్తముఖంమీద చెయ్యివేసింది. అదమరచి ఆలోచిస్తున్న అతను ఉలిక్కిపడి "ఏవిటి" అన్నాడు. ఆమె ఈసారి అవే మాటలు సుదీర్ఘంలతో అంది. ఆ మాటలకు మృత్యుంజయుడు చిన్నగా చిరునవ్వు నవ్వాడు. ఆ నవ్వు విరాగినవ్వులా ఉంది ఆమెకు. "ఏం ? ఇవాళ అదోలా ఉన్నారు ?" అంది వడవలోంచి రూములోకి వెళుతూ. మృత్యుంజయుడు మారుమాట్లాడకుండా ఆమెను అనుసరించాడు. ఆమె సోఫాలో కూర్చుని "ఏం నాతో చెప్పకూడదా ?" అంది. మృత్యుంజయుడు ఆమాటలకు నవ్వుముఖంతో "నీతో చెప్పకుండా ఎలాగ ?" అన్నాడు. అతని నవ్వు ఆమెకు సంతృప్తినివ్వలేదు. "సరస్వతీ, నా మొదటిభార్య ఇవాళ గుర్తుకు వచ్చింది. ఆమెకథను నీకు చెప్పనా ?" అంటూ లేచి నించున్నాడు. సరస్వతి కొంచెం తమాయించుకుని "చెప్పండి" అంది.

అతను తన మొదటిభార్య చనిపోయిననంగతి ఆమెతో ఇదివరలో ఒకసారి చెప్పాడు. కానీ ఆ చనిపోయిన 'కథ' విషయం ఎప్పుడూ ప్రస్తావించలేదు. ఆమె చెప్పమనగానే మృత్యుంజయుడు సోఫాలోంచి లేచి కిటికీలోంచి బయటకు చూస్తూ ప్రారంభించాడు.

"నా మొదటి .... మొట్టమొదటి భార్య సుగుణ. ఆమె చాలా అందమైనది ......"

గడియారం 'ఠంగుఠంగు' న అయిదుగంటలు కొట్టింది. మృత్యుంజయుడు గంటలు లెక్కపెట్టడం అయినతర్వాత ఆ కథను ప్రారంభించి ముగించాడు. కథ ముగించేసరికి ఠంగున అర గంట కొట్టింది మృత్యుంజయుడు ఇంకా అలాగే నీలాకాశంవంక చూస్తూ నుంచున్నాడు. కథ వింటున్న సరస్వతిమీదకు అతని దృక్కులు అతి నెమ్మదిగా మరల్చాడు ఆమె సోఫాలో తల పక్కకి వాల్చేసి ఉంది. కళ్ళు మూసుకొని ఉన్నాయి. మృత్యుంజయుడు రుమాలుతో నుదుటపట్టిన చెమటను తుడుచుకున్నాడు. ఆమెకేసి చూస్తూ అలాగే శిలాప్రతిమలా ఉండిపోయాడు. ఎరుపెక్కిన అతనికళ్ళనుండి రెండు వేడి కన్నీటి బొట్లు రాలి చంపలమీద నిలిచాయి.

"అమ్మగారు నిద్రపోయారా ! అదేవిటి ?" అంటూ వీరాస్వామి రెండు గ్లాసుల పాలతో గదిలోకి అడుగుపెట్టాడు. మృత్యుంజయుని వైఖరి చూసి అతను ఆందోళనపడుతూ గ్లాసులు టేబులుమీద పెట్టి మళ్ళా అవేమాటలు మాట్లాడాడు. మృత్యుంజయుడివైఖరిలో మార్పేమీ లేదు అత నలాగే రాతిబొమ్మలా నించున్నాడు. చూపులుమాత్రం ఆమెమీద నిలిచాయి. వీరాస్వామి ఈసారి మరింత గట్టిగా అదేప్రశ్న వేసి ఆమెకేసి తిరిగి "అమ్మగారూ, అమ్మగారూ, చిన్నమ్మగారూ" అన్నాడు. ఆమె పలుకలేదు. ఉలకలేదు. "నిద్రా ? ఇదేం నిద్ర ?" వీరాస్వామి తనలో తాను గొణుక్కున్నాడు

"అమ్మగారు....నిద్ర....కాదు .... పోయారు" ఈ మాటలు మృత్యుంజయుని నోట్లోంచి ప్రవాహం అయ్యాయి. ఆ మాటలు వింటూనే వీరాస్వామి ఒక్క దూకుతో సోఫావద్దకు వెళ్ళి ఆమెనుదుట చెయ్యిపెట్టి చూశాడు అతని చెయ్యి గడగడలాడింది. 'అమ్మా' అంటూ పసిపిల్లాడిలా ఏడుపు ప్రారంభించాడు. మృత్యుంజయుడు నెమ్మదిగా అడుగులువేసుకుంటూ కిటికీ వద్దకు చేరాడు అతనిలో అంతర్గత దుఃఖం పొర్లివచ్చింది. ఆవేశంతో తల గోడకేసి బాదుకున్నాడు. వీరాస్వామి అతన్ని—బలమంతా ఉపయోగించి వెనక్కు లాగాడు. మృత్యుంజయుడు యాంత్రికంగా ఆమె ఎదురుగా ఉన్న మరో సోఫాలో కూర్చున్నాడు.

* * *

వాయువేగంతో ఈ వార్త ఊరంతా పాకిపోయింది. కరణం, మునసబు, రాఘవేంద్రలు మనోవేగంతో వచ్చి వాలారు. మృత్యుంజయుడు సోఫాలో అలాగే నిర్జీవంగా కూర్చున్నాడు. రాఘవేంద్ర వీరాస్వామిని వివరాలు అడిగాడు. అతనేమీ చెప్పలేదు. రాఘవేంద్ర బయటకు పరిగెత్తి

ఇంటిల్లిపాదికి ఆనందం చేకూర్చే

**ఆంధ్ర సచిత్ర వారపత్రిక**

తప్పక చదవండి !




# క్షమాహతుడు

మృత్యుంజయుని కారుమీద పట్నంవెళ్లి డాక్టరును పిల్చుకొచ్చాడు. డాక్టరు పరీక్ష చేస్తూండగా "డాక్టర్! కొందరి కొందరి గుండె శ్వాస్పన్ని కొట్టుకోడం మానేసి మళ్లా పనిచేస్తుంది. అది దుర్బలంవల్ల జరుగుతుంది. నేను అలాటి కేసులు చాలా నా కళ్లతో చూశాను. సరిగా .... చూడండి" అన్నాడు ఆత్రంగా. డాక్టరు చూసి చూసి పెదవి విరుస్తూ "లేదు! గుండె ఆగి చనిపోయారు. ఇంతకుమునుపు ఈవిడకు ఇలాంటి జబ్బు ఉందా ? అంటే .... గుండె దుర్బలం" అంటూ అందరికేసి చూశాడు. కరణం గొంతు సవరించుకుంటూ "లేదండీ! నేనా పిల్లను ఎరుగుదును. మంచి ఆరోగ్యవంతురాలు. ఏనాడూ ఏరోగమూ రాలేదు" అన్నాడు. డాక్టరు బుర్ర గోక్కున్నాడు. తోలుసంచిలో సరుకులు సర్దుకుంటూ "అయితే! మరేకారణంవల్లయినా గుండె ఆగిపోయి ఉండాలి" అన్నాడు. రాఘవేంద్ర ఉలిక్కిపడ్డాడు. "గుండె ఆగిపోయింది. హఠాత్తుగా ఏదో వినడంవల్ల" అతను అరిచాడు. సోఫాలో విగ్రహంలా కూర్చున్న మృత్యుంజయుడు విరుచుకు పడిపోయాడు. డాక్టరు అతనికేసి పరుగెత్తాడు. రాఘవేంద్ర పిచ్చివాడిలా తనలో తాను గొణుక్కున్నాడు, బుర్ర గోక్కున్నాడు.

* * *

తెలివి, అయిడియాలున్న రాఘవేంద్రం బుర్ర 'గోకగా గోకగా' ఒక తెలివైన అయిడియా యిచ్చింది. ఇంటికివెళ్లిన అతను బుర్ర గోక్కుంటూ కూర్చోక తను సంపాదించిన, రాసిన అద్భుత విషయగ్రంథ సంపుటాలు తిరగెయ్యడం ప్రారంభించాడు. అతను తనతో తెచ్చుకున్న వాట్లల్లో అతనికి కొన్ని అనుమానాలు దొరికాయి. విసిరిన బంతిలా మునసబు ఇంటికి పరుగెత్తాడు... మునసబు, కరణం ఇంకా ఆ సంఘటనలోంచి తేరుకోలేక—'కోవాలా వద్దా' అని ఆలోచిస్తూ 'రావాలా వద్దా' అని గుమ్మం దగ్గర నించున్న రాఘవేంద్రను చూసి కోలుకొంటూ, లోపలకు రమ్మన్నారు. రాఘవేంద్ర అన్నదే తడవుగా నట్టింట్లోకి వచ్చేసి, ఖాళీగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు.

"జానకిరామయ్యగారి కూతురు సరస్వతి అలా గుండె ఆగిపోయి చనిపోయిందంటే నేను నమ్మలేకుండా ఉన్నాను. రాయిలాంటి పిల్ల" అన్నాడు కరణం నిశ్శబ్దాన్ని భరించలేక. రాఘవేంద్ర తను తెచ్చిన పుస్తకంలోంచి ఒకఘట్టం చదివేవాడి షోజులో కూర్చున్నాడు.

"ఏవిటో ? వేదాంతిగారు చకచకా చదివేస్తున్నారేవిటి ?" అన్నాడు మునసబు వెటకారంగా. రాఘవేంద్ర ఆ వెటకారంలో భావం గ్రహించే స్థితిలో లేడు. ఒకవేళ గ్రహించినా, హింసించడం అతని పనికాదు. గ్రహించడం వరకే అతని వృత్తి. అందుకని రాఘవేంద్ర గొంతు సవరించుకొంటూ "ఇది వినండి. మీరు ఆశ్చర్యపడి అనుమానపడతారు" అన్నాడు. 'పోనీలే విందాం' అనుకున్నట్లు కరణం, మునసబులు ఒకళ్లముఖాలు ఒకళ్లు

తూనుకుని విపరీతమైన ఆతని ముఖంవంక చూశారు. అతను ప్రారంభించాడు.

"ఇప్పటికి అరువందల సంవత్సరాల క్రితం .... వ్వు .... వ్వు .... ఆ ఊరు పేరూ, అతని పేరూ చెప్పకూడదులెండి" అన్నాడు తల ఎత్తుతూ.

"ఇదిమటుకూ చెప్పమని మేం అడిగామా ?" మునసబుమాట విస్సిరికొట్టాడు. అది వాతకాని కరణం తనచూపుతో కొట్టాడు. రాఘవేంద్ర ఇబ్బందిగా ముఖం పెట్టుకుని, సర్దిపుచ్చుకుని, గొంతు సవరించుకుని, ప్రారంభించాడు.

"ఇప్పటికి ఎనిమిదివందల సంవత్సరాల క్రితం ఒక ఊళ్లో ఒక జమీందారు ఉండేవారు. అతని వయస్సు ముప్ఫయి లోపు. ఆ ఊరు వచ్చిన కొన్నాళ్లకి అతనికి వివాహం అయ్యింది. వారం తిరగకమునుపే భార్య చనిపోయింది. మరో వివాహం చేసుకున్నాడు. పది రోజులు తిరక్కుండానే ఆమె పోయింది. మరో వివాహం—అదీ అంతే...అయితే ఈ చావుకు కారణం అడుగరేం ?" అతను వాళ్లని అడిగాడు.

వాళ్లు అడగదల్చుకోకపోలేదు, కానీ అడిగే స్థితిలో లేరు. ఆ స్థితి గమనించి మళ్లా అతనే, తనకు తనే, అడుక్కుని ప్రారంభించాడు.

"అందరు భార్యలూ గుండె ఆగిపోవడంవల్లే పోయారు."

"గుండె ఆగకుండా ఎవరైనా పోతారా ?" కరణం అడ్డువచ్చాడు. రాఘవేంద్ర తల గోక్కున్నాడు.

"వినండి" అతను వినిపించడం ప్రారంభించాడు.

"ఈ అతని భార్యందరూ ఏదో హఠాత్తుగా ఒక సంఘటనను ఎదుర్కోడంవల్ల గుండె ఆగి చనిపోయారట. అంటే గుండె ఆగిపోయేఅంత దారుణమైన విషయం విన్నారన్నమాట !" అతను ఆగాడు. ఈ కథలో మర్మం మునసబు కరణాలకి పై ఆవగింజంత అర్థమయ్యింది.

"మన మృత్యుంజయునిభార్య పోయినట్లే !" కరణం అంతర్గత ఆశ్చర్యాన్ని అవతలికి వదిలేశాడు.

"అవును...ఇది వినండి...మళ్లా నూట యిరవై సంవత్సరాల క్రితం యిదే వింత...అతనికీ ముగ్గురు భార్యలు గుండె ఆగి చచ్చారు. ఓపికగా ఆ ఊరు వాళ్లు మరో మూడుచావులు కూడా చూశారు. ఆనాటికి అతనికి ఆరుగురు భార్యలు పోయారు. అప్పటికి జనంలో అలజడి బయల్దేరింది. 'అతడు రాక్షసుడు అన్నారు కొందరు...దయ్యం అన్నారు... పిశాచి, కాదు. ప్రాణాంతకుడు..నరాంతకుడు..దేవాంతకుడు" అని యిలా ఎన్నో రకరకాలుగా అన్నారు. అతన్ని చీదరించారు. చీత్కరించారు. క్రమేణా అతను ఆ ఊళ్లోంచి వెళ్లిపోయాడు ...." అతను ఆయాసపడుతూ ఆగాడు.

(సశేషము)




## పూవు మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీ సరియైన చర్యను గురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, మీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపండి.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదీలగాయతు 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో మీకు జయముకలుగునో, మీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రమే వి. పి. గా పంపగలము. (వి. పి. ఛార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్నరొడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన ఫోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt DevDutt Shastri, Raj Jyotishi (WP-18) Jullundur City.



కేశ సమస్యలను తీర్చే



అతి త్వరలో

కురుల్లను బలపరచుటయే గాక, మనోహరమైన నిడుపాటి నల్లని శిరోజములను పెంపొందించును. దీనిలో చేర్చిన ఔషధి సంపదవల్ల కేశములు ఊడిపోకుండగను, చుండ్రు లేకుండగను, నెరవకుండగను రీటా కాపాడగలదు.

రీటాను కొబ్బరినూనెలోగాని, మంచినూనెలోగాని కలిపి నిత్యం వాడండి. తప్పకుండా మీ కేశములు నల్లబడతాయి, దీనిని మీరు వాడి, మీ స్నేహితులకు కూడ సిఫార్సు చేయండి.



రీటా

అందమైన కేశ సంపదకు

రీటో కంపెనీ,
మద్రాసు-1

R-570




**మృత్యుంజయుడి పూర్వగాథ తెలిసిందనుకున్నారు. వారి ఊహ ఎంతవరకూ నిజం ?**

(గతవారం తరువాయి)

"అయితే ఇంతకీ మీ రనే దేవిటి ?" మునసబు ప్రశ్నించాడు.

"ఇంతకీ వాడే వీ డంటారేవిటి?" ఆ మాటను కరణం పూర్తిచేశాడు.

"అనడానికి ప్రయత్నిస్తాను" రాఘవేంద్ర కుర్చీచేతిమీద ముక్తాయింపు వేశాడు. మునసబు కరణాలు 'కోరస్ జాతి' నవ్వు నవ్వారు.

"భలేవాడివయ్యా, తెలితక్కువమనిషి ! నువ్వు ఎనిమిది వందల సంవత్సరాలనాటి మనిషి ఈ నసికుర్రాడు అంటావు ? బుర్ర ఉపయోగించద్దూ ? ఊ .... నిండా ముప్ఫయి యేళ్ళు లేనివాణ్ణి పట్టుకుని ఎనిమిదివందల ఏళ్ళనాటి వాడంటావే ? భలే" అన్నాడు మునసబు నవ్వుతూ. "భలే ! భలే !" అన్నాడు కరణం మిగతా రెండు 'భలే' లనూ భర్తీచేస్తూ. రాఘవేంద్రకు చిర్రెత్తిపోయింది. ఓ పుస్తకం క్రింద నుంచి తీస్తూ అందులో ఒక పేజీ తీశాడు. తనకు కావలసిన పేజీలు చకచకా తిరగేశాడు. "ఇదిగో ! అతని పేరు" అన్నాడు. ఇదిగో ఊరు పేరు..."చూడండి. నమ్మకపోతే, నాది నేరం కాదు" అంటూ పుస్తకం మునసబుచేతిలో పెట్టాడు. మునసబు పుస్తకంలోకి చూడకుండానే "అది సరేనయ్యా ! నీ గ్రంథం తప్పనటం లేదు. ఆనాటి వ్యక్తీ, ఈనాటి వ్యక్తీ ఒక్కడే ఎలా అవుతాడు అన్నది మా ప్రశ్న" అన్నాడు ప్రశ్నార్థకంగా కరణం కేసి చూస్తూ. "అవును. అదే" అన్నాడు కరణం లయగా.

"అతనే ఇతనని నేను అనటంలేదు. కానీ ఆ సంఘటనలూ, ఈ సంఘటనా ఒకలాగానే ఉన్నాయి అన్నాను...తర్వాత అనుమానించాను... ఇంగ్లీషు పురాణాలు చదవండి...అంతదాకా ఎందుకు. తెలుగుపురాణాలు చూడండి .... శాపకారణంవల్లో, వరకారణంవల్లో ఎంతమంది వందలకు వందల ఏళ్ళు బ్రతకలేదు.....ఆనాడు సంభవమైనది ఈనాడు ఎందుకు సంభవించకూడదు ? ఆలోచించండి."

మునసబుగారు తనవంతు బుర్రగోక్కుంటూ కరణంకేసి చూశాడు. కరణం బుర్ర గోక్కోటం లేదు సరికదా ఆ ప్రయత్నంలోకూడ లేడు. మాట్లాడే యత్నంలో ఉన్నాడు.

"అయితే అతను ఏ దేవతో అంటారా ?" అన్నాడు కరణం తన 'ఆది ఊహ' ప్రకారం.

"అయితే అవ్వచ్చు. లేకపోతే ఏ రాక్షసుడో అవ్వచ్చు" రాఘవేంద్ర అన్నాడు. ఆ మాటలకు వారిద్దరూ ఉలిక్కిపడి వీపులు చరుచుకున్నారు.

"రెండూ సంభవాలే ! ఎందుకైనా మంచిది. ఒక్కసారి అతని ఇంటికి వెళ్ళి పలకరిద్దాం. రండి రంగు తేలుతుంది" అంటూ రాఘవేంద్ర లేచాడు. ఆలోచించిన మునసబు ప్రయాణాన్ని సాయంకాలానికి వాయిదావేశాడు.

* * *

గ్రంథసమేతుడైన రాఘవేంద్ర, కరణంమునసబులతో కూడి మృత్యుంజయుని మేడ చేరుకున్నాడు. హాలులో కూర్చున్న మృత్యుంజయుడు వారిని చూసి "రండి" అన్నాడు. అతని కంఠం నూతిలోంచి వచ్చిన శబ్దంలా వినిపించింది. ముగ్గురూ కూర్చున్నారు. మృత్యుంజయుడు అలా శూన్యంలోకి చూసి విషాదభరితమైన నవ్వును నవ్వాడు.

"మీరిలా నిరుత్సాహపడకూడదు" రాఘవేంద్ర ప్రారంభించాడు.

"మళ్ళీ వివాహం చేసుకోండి .... మీకేం ? వయస్సులో ఉన్నారు. ఆ పిల్ల పాపం .... మిమ్మల్ని అన్యాయంచేసి పోయింది. మీ జీవితాన్ని మీరు అన్యాయం చేసుకోవద్దు. మీరు 'ఊ' అంటే రేపు ఈపాటికి పావలా క్లాసుదగ్గర క్యూ లా తండ్రులు తమపిల్లలను పట్టుకుని మీ మేడ ముందు నించుంటారు."

మృత్యుంజయుడు నవ్వుతూ "పెళ్ళి..పెళ్ళి" అని గొణుక్కున్నాడు. మళ్ళా రాఘవేంద్ర ప్రారంభించాడు.

"మాటవరసకు చెపుతాను. నూట ఇరవై సంవత్సరాల క్రితం మీ వయస్సు కుర్రాడే పాపం ... ఆరు పెళ్ళిళ్ళు చేసుకున్నాడు. అందరూ ఇలాగే గుండె ఆగిపోయి పోయారు. అతను మీలా నిరుత్సాహ పడ్డట్టు కనబడడు." అతను ఆగాడు.

మృత్యుంజయుని ముఖమంతా ముచ్చెమటలు

పోశాయి. శాయశక్తులా ప్రయత్నించి నిగ్రహించుకుంటూ "అహ! తర్వాత" అన్నాడు రుమాలుతో ముఖం తుడుచుకుంటూ.

"ఇలాంటి సంఘటనే ఎనిమిదివందల సంవత్సరాల క్రితం జరిగింది. అదీ ఇంతే."

"ఆహ!" అంటూ మృత్యుంజయుడు లేచాడు. అతను లేవడంవల్ల గ్రహించదగిన విషయాన్ని గ్రహించి ముగ్గురూ లేచి నించుని "వస్తామండీ" అన్నారు వెళ్లిపోయే ధోరణిలో. "మంచిది" అన్నాడు మృత్యుంజయుడు ముక్తసరిగా.

*　　*　　*

మునసబుగారింటి అరుగుమీద మళ్లా 'ముగ్గురి ముచ్చటలు' ప్రారంభమయ్యాయి.

"మీరు ఎన్నన్నా చెప్పండి. ఇతన్ని పట్టుకుని ఎనిమిదివందల ఏళ్లనాటివాడు అనడం బాగులేదు. అలా అనడంలో తెలివితక్కువదనం కనిపిస్తోంది" అంటూ కరణం తనమాటలో వదిలేసిన 'మీ' కోసం రాఘవేంద్ర వైపు చూశాడు. రాఘవేంద్ర కుర్చీలో అటూ ఇటూ చిరాకుగా కదిలాడు. అతని కళ్లు ఎర్రబడ్డాయి.

"ఇష్టం కరణంగారు ఇంతవరకూ ఏమన్నాడ్డాను ఇప్పుడు చివరికి తెలివితక్కువవాణ్ని అనేశారు. శాస్త్రం సైన్సు తెలియనివాళ్లకి తెలియ చెప్పడంలోనే నా తెలివితక్కువదనం ఇమిడిఉండి ఉండచ్చు... అతను ఎనిమిదివందల సంవత్సరాలనాటి వాడని నేను అనటంలేదు. కానీ ఆనాడు అలా భార్యలను పోగొట్టుకున్నవాడిలో ఉన్న కారణం ఇతనిలో కూడా ఉండి ఉండచ్చు అని అనుమానించాను. ఏది ఏమైనా నేనీ విషయాన్ని చివరిదాకా లాగదల్చుకున్నాను. కొన్ని పుస్తకాలు ఇంకా చదవాలి" అంటూ లేచాడు. మిస్టర్ కరణంకూడా లేచాడు. మునసబూ లేచి నించున్నాడు. రాఘవేంద్ర ఏదో గొణుక్కుంటూ వెళ్లిపోయాడు. అతను వెళ్లిపోవడాన్ని నిశ్చయించేసుకున్న తరువాత "వీడికి బుర్ర చెడినట్లుంది. లేకపోతే ఇదేం పురాణకాలమనుకున్నాడా? వెర్రివెధవ" అన్నాడు కరణం మునసబుతో.

"మరే! అందుకనే—పెళ్లీ పెడాకులూగూడా మానేశాడట. పిచ్చి ముదిరించుకోడానికి" అనేసి మునసబు వీధిగుమ్మందాకా వెళ్లి అటూ ఇటూ చూసి నిబ్బరంగా గాలిపీల్చాడు. కరణం తర్వాత తన ఇంటికి చేరాడు.

'ఇంట్లో కూర్చుని పుస్తకాలు చదువుతున్నవాడల్లా 'అది' ఎగిరిపోయేలా అరుస్తూ రాఘవేంద్ర రోడ్డుమీదకు పరిగెత్తాడు...."వెయ్యి... వెయ్యి" అని గొణుక్కుంటూ మునసబు యింటికి వెళ్ళాడు. ఆ మాటలు విని ఇవతలకు వచ్చిన మునసబు అతన్ని చూస్తూ "ఏమిటి వెయ్యను?" అన్నాడు.

"సంవత్సరాలు"

"సంవత్సరాలు వెయ్యడం ఏమిటి? అవేం పిల్లిమొగ్గలనుకున్నావా?" మునసబు ఆశ్చర్యపోయాడు.

రాఘవేంద్ర ఆ మాట వినిపించుకునే స్థితిలో లేడు. కదం తొక్కుతూ నించున్నాడు. ఏదో గొణుక్కుంటున్నవాడల్లా "వెయ్యి సంవత్సరాలు నేను ఒక ఊరు వెళ్ళి కొద్దికాలంలో వస్తాను. అప్పుడు నిరూపించగలనేమో! వస్తాను...వెయ్యి సంవత్సరాలు" అనేసి, మళ్ళీ నడక ప్రారంభించాడు. అప్పుడే రోడ్డుమలుపు తిరుగుతున్న అతన్ని ఉద్దేశించి "ఏవయ్యోయ్! వెయ్యి సంవత్సరాలకు వస్తావా? ఆ! ఏవంటావు?" అని అరిచాడు మునసబు. ఆ మాటలకు దూరమైన రాఘవేంద్ర ఏమీ అనకుండా మలుపు తిరిగిపోయాడు. "ఛీ....బుర్రతక్కువ గాడిద...." అని వాణ్ణి తిట్టి, కరణంకి కబురంపి "ఈ సంగతి" కరణంకి చెప్పాడు. అంతా విన్న కరణం హాయిగా, కులాసాగా నవ్వుతూ "వెర్రి వెధవ... ఏమయితేనేం ఈ వూరు వదలిపోయాడు. పీడ వదలిపోయింది" అన్నాడు.

*　　*　　*

అలా అని అవేళ్టికి మూడు రోజులయ్యింది. అవేళ పొద్దున్న మునసబు కరణంతో "ఆపీడ వదిలింది. మరి, ఈ పీడ ఏమయ్యింది? ఈమధ్యన అటు వెళ్ళారా?" అన్నాడు. కరణం వెళ్ళనట్లుగా తలతో సైగచేసి, ఇంటికి చేరుకోబోతూ ఆలోచనలతో

---

ఏం వమ్మా మరీ అంత
పల్చని చీరకట్టుకున్నావు,
మీ అమ్మ చూస్తే ఏమం
టుంది? అని బీచికివచ్చిన ఒక
యువతిని ఒక నడివయస్సు
స్త్రీ ప్రశ్నించింది.
యువతి: ఈ చీర మా
అమ్మదేగా!

---

మెదిలిన ఆలోచనతో అడ్డదారిపట్టి మృత్యుంజయుని ఇంటిదారిపట్టి అతని మేడ చేరుకున్నాడు. మృత్యుంజయుడు గడపలోనే ఎదురయ్యి కరణాన్ని ఆహ్వానించాడు. అతను కట్టుకున్న బట్టలు చిరిగిపోయి దీనావస్థలో ఉన్నాయి. గడ్డం కూడా హద్దుమీరి పెరిగిపోయి ఉంది. అతన్ని చూస్తూనే కరణం గతుక్కుమన్నాడు. కడుపులో చెయ్యి పెట్టి కదిల్చినట్టు బాధపడ్డాడు. కుర్చీలో కూర్చుని మరో లోకంలోకి చూస్తున్నట్లు ఎటో శూన్యంలోకి చూస్తున్న మృత్యుంజయుణ్ణి పలకరించడానికి అతనికి ధైర్యం చాలలేదు. దాన్ని పోగుచేసుకునే సరికి పది నిముషాలు పారిపోయాయి. ఇక యిలా కూర్చోడం బావుండదని ప్రారంభించాడు.

"బాబూ, మీ తండ్రిలాటివాణ్ణి. ఒక్క సలహా యిస్తాను. వింటారా?"

మృత్యుంజయుడు తన చూపును, దానితోపాటు తలనూ కరణంకేసి తిప్పాడు. కరణం అన్నాడు.

"పుట్టిన ప్రతివ్యక్తీ చావక తప్పదు"

"పుట్టిన ప్రతీ వ్యక్తీ చావక తప్పదు" మృత్యుంజయుడు ఆ మాటలను వింతగా పలికాడు.

"అవును బాబూ, ఆసంగతి తెలిసి కూడా పోయినవాళ్ళకోసం, పోయిన పాడు గుహా ఇలా విచారించడం, అన్నీ తెలిసిన మీలాంటివారు యింతగా ఇది అవటమూ, నాలాటివాడు నచ్చచెప్పడమూ బావుండదు. మీకేం వయస్సు మళ్ళిందా? మళ్ళా......అవును.....మళ్ళీ వివాహం చేసుకుని హాయిగా ఉండచ్చు. నా మాటల్లో సత్యాన్ని గ్రహించండి....." కరణం తను చెప్పడం ఆపి అతనికేసి చూశాడు.

"మళ్ళీ పెళ్ళిచేసుకోమంటారా"

"అవును" కరణం కొంచెం జంకుతూ అన్నాడు. మృత్యుంజయుడు నవ్వుతూ లేచి నించున్నాడు. కరణం కూడా లేచాడు.

"కరణంగారూ, నా అన్నవాడులేని నాకు ఆ 'నా'త్వం మీలో కనిపించింది. మీ ఆదరాభిమానాలకు నేను చాలా ఋణపడ్డాను. నా అభిప్రాయం మీ అభిప్రాయంతో ఏకీభవించిననాడు మీ సలహా తప్పక పాటిస్తాను" అన్నాడు మృత్యుంజయుడు తల వంచుకుని. కరణం మాట్లాడలేక రెండు క్షణాలు నిశ్శబ్దంగా ఉండి "మంచిది బాబూ! మీరూ ఆలోచించుకోండి. కానీ...." అంటూ ఆగాడు. మృత్యుంజయుడు తల పైకి ఎత్తకుండానే 'కానీ?' అన్నాడు.

"ఒక్క మనవి...ఆ రాఘవేంద్ర మీ మీద ఏదో నిరూపిస్తానని వెర్రి కేకలు వేసి వెళ్ళాడు... అతను వచ్చేలోపునే ఒక నిర్ణయానికి వచ్చి వివాహం చేసుకోడం....." అని "నేను వస్తాను" అని వెళ్ళిపోయాడు. కరణం వెళ్ళినతర్వాత వీరాస్వామి కూడా తనస్వామితో అదే చెప్పాడు. కానీ ఆ స్వామి వినిపించుకున్నట్లు ఎవ్వరికీ తోచనేలేదు.

*　　*　　*

ఇది జరిగి మరో మూడు రోజులు అయ్యింది. అవేళ్టికి ఆరురోజులకు పైగా మృత్యుంజయుడు మేడదాటి ఇవతలకు రాలేదు. ఆవేళ సాయంత్రం చక్కగా ముస్తాబయి వీధిగుమ్మంవద్దకు వచ్చాడు. గుమ్మంలో అడుగుపెడుతున్న వీరాస్వామి అతన్ని తను చూడననుకున్న పరిస్థితిలో చూసినందుకు ఆనందించి "బాబుగారు" అనేసి ఊరుకున్నాడు, ఆపైన ఏమనాలో తెలియక. అతనిభావం గ్రహించిన మృత్యుంజయుడు చిన్నగా నవ్వుతూ "అలా షికారుకు వెళ్ళివస్తాను" అన్నాడు. ఈలోగా కరణం కూడా వచ్చి మృత్యుంజయుని ముఖవైఖరి, వైఖరి చూసి ముచ్చటపడ్డాడు. తనపనికి వాయిదా వేసుకుని మృత్యుంజయుడు కరణాన్ని కూర్చోమంటూ అతని ఎదురుగాఉన్న మరో సోఫాలో తను కూర్చున్నాడు.

"కరణంగారూ! ఒక ప్రశ్న అడుగుతాను కానీ ప్రమాణం చేసి నిజం చెప్తారా?"

కరణం హడిలిపోయి, ఎగిరి తిన్నగా కూర్చున్నాడు. చెప్తాననడానికి నోరు రాక తలతోనే సూచించాడు.

"ఈ ఊరి ప్రజలు నన్నుగూర్చి ఏమనుకుంటున్నారో దాచకుండా చెప్పండి"

కరణం కరడుగట్టుకుపోయాడు. మృత్యుంజయుడు మళ్ళా అదే ప్రశ్న వేశాడు. కరణం

(35-వ పేజీ చూడండి.)



## పూవు మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీ సరియైన చర్యనుగురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయుతేదీ, వేళ వివరములున్నూ, మీ సరియైన చిరునామా యున్ను వెంటనే వ్రాసి పంపండి.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డువ్రాసిన తేదీలగాయతు 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో మీకు జయముకలుగునో, మీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రమే వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్న యెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

**Pt DevDutt Shastri, Raj Jyotishi (WP-18) Jullundur City.**



# రెక్స్ జెల్లీ



## కంటికింపైనది..మంచిరుచియైనది..చాలామంచిది!

ఇదిగో వర్లరుచిగల ఫలహారము, దీనిని తయారుచేయుట ఎంతో సులభం. రెక్స్ జెల్లీ క్రిస్టల్సును వేడి నీటిలో కరిగించండి. తరువాత 1. పైంటు (20 ఔన్సులు) అగుటకు కావలసినంత చన్నీళ్లు కలపండి. దానిని ఒక అచ్చులోపోసి జెల్లీ గట్టిపడువరకూ కుంచు గడ్డ మీద వుంచండి.

అది సులువుగా జీర్ణమయ్యే పుష్టికరమైన ప్రీతియగు ఇంటి ఫలహారము, కోలుకుంటున్న రోగులకు కూడా దివ్యమైనది.

రెక్స్ జెల్లీ క్రిస్టల్స్ 6 రుచులలో లభించుచున్నవి: రాస్ బెర్రీ, స్ట్రాబెర్రీ, లెమన్, పైనాపిల్, ఆరెంజ్, చెర్రీ.






**కార్న్ ప్రాడక్ట్స్ కో. (ఇండియా) ప్రయివేట్ లి.,**

దక్షిణ భారతదేశంలో ఏజెంట్లు: పార్రీ అండ్ కంపెనీ, లిమిటెడ్




అండ కావలసివచ్చి దానికోసం కబురుపంపాడు. ఆ (అండ) కరణం అరక్షణంలో వచ్చాడు. "ఇపుడు చెప్పవయ్యా" అన్నాడు మునసబు ధీమాగా అండ చూసుకుంటూ.

"నేను చెప్పను" రాఘవేంద్ర బిగించుకుపోయాడు. ఆ మాటలకు వాళ్ళిద్దరూ ఆశ్చర్యపోయారు.

"అవును....పూర్తిగా పరిశీలించకమునుపే, అసంపూర్తిగా చెప్పడం నా తెలివితక్కువ....ఒక, ఒక్కవారంరోజుల్లో తేల్చేస్తాను .... అపుడు చెప్తాను. అయితే...." అతను ఆగాడు.

"అయితే.......?" మునసబు అందుకున్నాడు.

"మీరు ఒక్క సహాయం చెయ్యాలి. నా పరిశోధనకోసం నేను మృత్యుంజయుని ఇంట్లోనే మకాం పెట్టవలసివుంటుంది. దానికి మీరు నాకు సహాయం చెయ్యాలి...." అతను ఆగాడు. కరణం మునసబులు ఒకళ్ళ ముఖాలు ఒకళ్ళు చూసుకున్నారు.

"నేను అతనికి ఏమీ హాని చెయ్యను....నా విద్య సాక్షి" అంటూ అతను జేబులోంచి ఆ పుస్తకం తీశాడు. వా రిరువురి దృష్టి ఆ పుస్తకం మీద పడింది.

"ఇది....ఒకసంఘటన....ఇలాంటి సంఘటనే చూసి రాసిన పుస్తకం....అంటే ఒక వ్యక్తి చూసి రాశాడట. దాన్ని యథాతథంగా యీ పుస్తకంలోకి ఎక్కించారు. దీని విలువ ఎంతో తెలుసా"

వాళ్ళిద్దరూ ఆలస్యంచేయకుండా తెలియదని చెప్పేశారు.

"నా జీవితం....దీని విలువ" అన్నాడు రాఘవేంద్ర పుస్తకం తనగుండెకు హత్తుకుంటూ. వాళ్ళిద్దరూ ఆశ్చర్యపోయారు.

"ఈ పుస్తకం.....కొన్ని వందల సంవత్సరాల నాటిది.....ఇప్పుడు నాపనంతా దీనితోనే ఉంది" అన్నాడు దానిని జేబులో పెట్టుకుంటూ. వాళ్ళిద్దరూ మాట్లాడలేదు.

"మరి నేను కోరిన విషయం...?"

మునసబుకరణాలు ఒకరిముఖం ఒకళ్ళు చూసుకున్నారు. కళ్ళతో ప్రశ్నించుకుని కనుబొమ్మలతో సమాధానం చెప్పుకుని, వాటిని సంగ్రహపరచి "సరే...ప్రయత్నిద్దాం" అన్నారు. కరణం లేచి నించుని "మీ పరిశోధన నెగ్గకపోతే నష్టపరిహారంగా వెయ్యి రూపాయలు ఇవ్వాలి. అతనికి ఏ విధమైనటువంటి అమర్యాదా రాకూడదు. అనుమానం తగలకూడదు....మీరు ... మీ పరిశోధన నిజమయితే...మా సహకారం ఎప్పుడూ ఉంటుంది. మేము 'న్యాయపక్షులం' అన్నాడు చేతులు ఎగరేస్తూ.

* * *

దీపాలుపెట్టేవేళ ముగ్గురూ కలిసి మృత్యుంజయుని ఇంటికి వెళ్ళారు. మృత్యుంజయుడు 'అతిథి'మర్యాదలతో వారిని యథావిధిగా సత్కరించాడు. "నోరువాటం' కల కరణం అసలు పని ఎరుకపరిచి "వారు ఏదో గ్రంథం రాసుకుంటారట. ప్రశాంత వాతావరణంకోసం మీ.....తమ....బంగళాలో ఒక చిన్న రూము ఇప్పించితే... ఓ వారంరోజుల్లో వెళ్ళిపోతారు" అంటూ

ఆగాడు. రాఘవేంద్ర "అవును" అన్నాడు చేతులు నలుపుకుంటూ. మృత్యుంజయుడు ఈ విషయం ఆలోచించడానికి అరక్షణంకూడా తీసుకోలేదు. చిరునవ్వుతో "వారికి నచ్చిన రూములో ఉండమనండి. నాకేమీ అభ్యంతరంలేదు" అన్నాడు పెద్దమనిషిలాగ. కార్యవాది అయిన రాఘవేంద్ర అవకాశాన్ని దుర్వినియోగం చేసుకోలేదు. "మేడమీది గది ఒకటి ఇప్పించండి చాలు" అన్నాడు దురాశ లేనట్లు. మృత్యుంజయుడు తక్షణం వాళ్ళను మేడమీదికి తీసుకువెళ్ళి ఒకగది ఇచ్చాడు. ఆ గది, పరిసరప్రాంతాలూ, వీళ్ళూ, వాటాలూ, కవాటాలూ చూసుకుని రాఘవేంద్ర తృప్తిగా తల ఊపుకున్నాడు.

* * *

అలా 'తల ఊపుకున్న' రాఘవేంద్ర నాలుగు రోజులు అయినా 'తలలు ఊపే పని' ఏమీ చెయ్యలేదు. మరో మూడురోజులదాకా మునసబు కరణాలు గడువుననగతి గుర్తుంచుకుని ఓపిక పట్టారు. ఆవేళతో అతని గడువు తీరిపోయిందని వాళ్ళు గ్రహించి, గుర్తుచెయ్యడానికి మృత్యుంజయుని ఇంటికి "అతను భార్యాసమేతంగా షికారు'కు వెళ్ళిన సమయంలో వెళ్ళారు. రాఘవేంద్ర చాలా గంద్రగోళాలలో ఉన్నట్లు కనబడ్డాడు. ఒక టేబులునిండా కాగితాలూ, కలాలూ, పుస్తకాలూ చిందరవందరగా ఉన్నాయి. రాఘవేంద్ర మరో రెండురోజులు గడువు ఇవ్వమని, ఆలోగా తనుగనుక ఏమీ తేల్చుకోలేకపోతే లెంపలు వేసుకుని దండాలుపెట్టి మరీ వెళ్ళిపోతానని బ్రతిమాలాడు. 'పోనీలే చూద్దాం మన సొమ్మేం పోయిందని?' అన్నట్లుగా మునసబు కరణంకేసి చూశాడు. కరణం తన సమ్మతిని సూచించి, రాఘవేంద్రకేసి చూస్తూ, "రెండు రోజులు—అనగా నలభై ఎనిమిది గంటలు....అంతే...." అన్నాడు ఇంగ్లీషువాళ్ళ పద్ధతిలో ముక్తసరిగా. రాఘవేంద్ర తల ఊపాడు.

"సరే"నంటే "సరే"నని మునసబు కరణాలు ఇంటిదారిపట్టారు.

* * *

రాఘవేంద్ర పెట్టిన రెండురోజుల గడువు కూడా పూర్తయ్యింది. తెల్లారితే పూర్తవుతుంది అనగా ఆ రాత్రి రాఘవేంద్ర చాలా బాధ పడ్డాడు. తెల్లవారుతోంది అనికాదు, గడువు తీరిపోతోందే అని. గడువు తీరనేతీరింది. తెల్లవారి లేచి చాలా చిరాకుగా పచార్లు ప్రారంభించాడు. అతని కళ్ళు అనుకోకుండా క్యాలండరువంక చూశాయి. చూసి మెరిశాయి. రాఘవేంద్రముఖం గాలిపోసుకున్న బుడగలాగ ఉబ్బిపోయింది. (ఆనందంతో) రూములో కూర్చుని పుస్తకాలన్నీ సర్ది రాసిన కాగితాలను మడవడం ప్రారంభించాడు. ఆవేళ ఆదివారం!

* * *

పదిగంట లయ్యింది. పదకొండు అయ్యింది. పన్నెండు అయ్యింది. మునసబుకరణాలు "ఇదేం పెద్దమనిషి" అనుకున్నారు రాఘవేంద్రను గురించి. ఆసంగతి వెళ్ళి అడగాలంటే సాయంత్రం మృత్యుంజయుడు భార్యాసమేతంగా షికారు వెళ్ళాలి....అంతవరకూ లాభంలేదు. అది తెలిసిన విషయమేగనుక ఈలోగా వాళ్ళు అలాటి ప్రయత్నాలు చేయకుండా, రాఘవేంద్రను తిట్టుకుంటూ కూర్చున్నారు. అలా కూర్చుని ఉండగానే గడియారం మూడుగంటలు కొట్టింది. రాఘవేంద్ర ఆయాసంతో పరుగుపరుగున వచ్చి అరుగుమీద కూర్చున్నాడు. ఇందాకటినుండి అనుకుంటూ ఉండడంవల్ల వెంటనే మునసబు "ఏం పెద్దమనిషివయ్యా" అనేశాడు. రాఘవేంద్ర ఆయాసం తీర్చుకుంటూ ఆగమని అభయహస్తంతో సూచించాడు. వాళ్ళు ఆగినతర్వాత ప్రారంభించాడు.

"ఇవాళ రాత్రయ్యి తెల్లారేలోపునా తేలిపోతుంది. ఒక్కరోజు గడువియ్యండి చాలు...మరో విషయం.."

"ఏవిటాం విషయం?" గద్దించాడు కరణం.

"ఇవాళ అతను షికారునుంచి వచ్చేసరికి మనం ముగ్గురం నా రూములో కూర్చోవాలి. మరో విషయం.....ఆ వీరాస్వామి ఆ బంగళాలో లేకుండా చెయ్యాలి" అతను ఆగి వాళ్ళకేసి చూశాడు. మునసబుకరణాలు "ఒళ్ళు మండిపోయిన పోజు"లో ఒకళ్ళకేసి ఒకళ్ళు చూసుకున్నారు. మునసబు పెద్దవాడు గనుక (ఉద్యోగరీత్యాకూడా)" "ఎందుకు అతనుంటే ఏం?" అన్నాడు ఉండకుండా చెయ్యడం ఎలాగో తెలీక. రాఘవేంద్ర రుమాలుతో నుదురు తుడుచుకున్నాడు.

"అతనుంటే యీ విషయం తన యజమానికి తెలియచేస్తాడు"

మునసబు ఒక్క నిముషం ఆలోచించాడు. వెంటనే పాలేరును పిలిచి వీరాస్వామికి కబురు పెట్టాడు. వీరాస్వామి ఆఘమేఘాలమీద వచ్చాడు. మునసబు అతనికేసి చూస్తూ "చూడు వీరాస్వామీ, జానకిరామయ్యగారు లేరూ, సరస్వతితండ్రి ఆయన్ని నేను రమ్మన్నానని చాలా జరూరుగా పిలుచుకురావాలి. ఈ రాత్రికి వెళ్ళి రాత్రి అక్కడ ఉండి తెల్లారేసరికి ఇక్కడ ఉండాలి. మీ అయ్యగారికి తోడు రాఘవేంద్రగారు ఉన్నారులే! అది గాక నేను పనివాణ్ణికూడా పంపుతాను" అన్నాడు. వీరాస్వామి 'అలాగే' అని వెళ్ళిపోయాడు. ముగ్గురూ సంతృప్తిగా నవ్వుకున్నారు.

* * *

అనుకున్నప్రకారం మృత్యుంజయుడు షికారు నుంచి వచ్చేలోగా ముగ్గురూ 'ఆ'రూములో చేరి కూర్చున్నారు. రాఘవేంద్ర చాలా అలసటగా ఉన్నాడు. ఒక పుస్తకం, కొన్ని కాగితాలూ తీసి మునసబుకి ఇస్తూ "చూడండి! సైన్సును, విజ్ఞానాన్ని మీరు అనుమానించి అవమానించారు. ఈ రాత్రికి నేను రాసినట్లు జరిగితీరాలి....లేకపోతే నా విజ్ఞానం ఎందుకూ పనికిరానట్లే..... ఈ పుస్తకం మీజేబులో ఉంచండి. సంఘటన అవంగానే చూడండి. నేను రాసినట్లే ఉంటుంది. ఈ పుస్తకంకూడా చూడచ్చు" అన్నాడు. మునసబు యాంత్రికంగా ఆ పుస్తకాన్ని జేబులో పెట్టుకుంటూ "అయితే యీ రాత్రి ఆమె చనిపోతుందంటారా?" అన్నాడు. రాఘవేంద్ర తల విదిలించాడు. "చచ్చితీరాలని కాదు....


పండిత
డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17

క్యాలెండర్లు
నాణ్యమైన ఫోటో ఆఫ్‌సెట్ క్యాలండర్లకు మమ్ము సంప్రదించండి. క్యాలండరు బొమ్మలను క్యాలెండరు మ్యానుఫ్యాక్చరర్లకు, ప్రింటర్లకు ప్రత్యేక ధరలకు సప్లయి చేయుదుము.
మంచికమీషను పై పని చేయుటకు సమర్థులైన ఏజంటు కావలెను. వ్రాయండి.
AJANTA ART CALENDER Mfg. Co.
P. B. 255, MADRAS—1.


జామ్-బక్
శమనపర్చి మాన్పును!
మీరు జామ్-బక్‌ను వాడితే తరువాత మంట పెట్టదు. ఎందుకనగా, దానిలో ఎన్నబడిన మూలికా అంటువిరోధక ఓషధులు గలవు. చర్మవాపులకు, తలగడ్డ వాపులకు, లోక ప్రసిద్ధయిన జామ్-బక్‌ను వాడండి. ఆయింట్‌మెంటు జామ్-బక్‌తో మీకు తక్షణ శమనము గలుగును. దీనిలో అంత క్రొవ్వులు నూనెలు లేవని గ్యారంటీ చేయబడినది
Zam-Buk
జామ్-బక్
మూలికా బామ్

ఇది మందుల వ్యాపారు లందరివద్దను దొరుకును.
ఏ. ఇ. పుల్‌ఫోర్డ్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్
బొంబాయి.
సోల్ ఏజంట్లు : దాదా & కంపెనీ,
86, సైనప్ప నాయక వీధి, మద్రాసు-1

కావాలి.....లేకపోతే యీ కథ అంతం అన్నా అవ్వాలి" అన్నాడు. "అంటే....ఇద్దరూ చచ్చిపోతారా?" అన్నాడు కరణం అనుమానంగా. రాఘవేంద్ర తల అడ్డంగా ఊపుతూ "దయచేసి ఇప్పుడేమీ అడక్కండి" అన్నాడు. ఇంతలో మేడమెట్లమీద చప్పుడు వినిపించి, చప్పుడు చెయ్యకుండా కూర్చున్నారు.

మృత్యుంజయుడు, సుగుణా రూములోకి వెళ్ళారు. రాఘవేంద్ర ఆ రూమువైపు గోడకు చెవి ఆనించి వింటున్నాడు. కరణం మునసబులు చెరో కుర్చీలోనూ కూర్చుని భయంభయంగా గాలి పీల్చుకోసాగారు.

* * *

"ఇవాళ మీరు అదోలా వున్నారు" అంది సుగుణ జడ విప్పుకుంటూ. మృత్యుంజయుడు ఆమెమాటలు విని విననట్లు ఊరుకున్నాడు. ఆమె జుట్టు విరబోసుకుని తలలో చిక్కుకున్న పూలను విడదీసుకుంటూ మళ్ళా అదే ప్రశ్న వేసింది. మృత్యుంజయుడు చిన్నగా నవ్వి కిటికీవద్దకు వెళ్ళి గగనంలోకి చూస్తూ నిలబడ్డాడు. ఒక్క క్షణం నిశ్శబ్దంగా ఉండి "చెప్పనా" అన్నాడు. "చెప్పమనేగా" అందామె చంపలమీద చేతులువేసుకుని వినే పద్ధతిలో కూర్చుంటూ.

"నా మొదటి భార్య.....గుర్తుకువచ్చింది..."

సుగుణముఖంలో సంతోషరేఖలు ఎగిరిపోయాయి. ఆమె లేచి భర్తవద్దకువెళ్ళి ఆప్యాయంగా అతనిభుజంమీద చెయ్యి వేస్తూ "మీరు అలా బాధపడద్దని ఎన్నిసార్లు చెప్పాను?" అంది. నిజానికి ఆమె ఒక్కగా నొక్కసారి చెప్పింది. అదైనా పెళ్ళయిన కొత్తలోనే. మృత్యుంజయుడు ఆమెకేసి జాలిగా చూశాడు.

"సుగుణా ఆకథ ఇవాళ నీకు చెప్పాలి"

"చెప్పండి. నేనేం విననన్నానా? ఎప్పుడైనా చెప్తానన్నారా?" అంది ఆమె వెక్కిరింపుగా చూస్తూ.

"అయితే అలా కూర్చో...." అన్నాడు. కానీ ఆమె కూర్చోకుండానే....'ఊ చెప్పండి'.....అంది.

"అలా కూర్చో" అన్నాడు అతను మళ్ళీ. సుగుణ టేబులుమీద కూర్చుంది. అతను ఆమె ఎదురుగా నించుని ప్రారంభించాడు.

"నా మొదటి భార్య......సుగుణ....అచ్చు నీ పోలికే! నీపేరే కూడా....."

"ఆమె పోలికా, ఆమె పేరే, నాకు" సుగుణ అతని మాటల్లో తప్పు సవరించింది.

"కాని....ఆమె ప్రేమ నన్ను ఆనందపరచలేదు. ఆమె మీద నాకు అనుమానం వచ్చింది. ఆమెశీలంమీద నాకు అనుమానంపుట్టి, అది నమ్మకమై కూర్చుంది. ఆమె ఏ పాపం ఎరుగదు....అమాయకురాలు...... నేను అనుమానించాను....ఆధారాలు లేకుండానే.... ఆ రోజుల్లో ఆమె గర్భిణీ.....నాకు పిచ్చి ఊహలూ, ఆవేశాలూ పుట్టాయి........" అతను వంచిన తల ఎత్తకుండా అలాగే నిలబడి చెప్పుకుపోతున్నాడు.

.....ఒకనాటి రాత్రి అనుమానపిశాచంతో ఆదమరచి నిద్రపోతున్న ఆమెను హత్యచేశాను....

# క్షమాహతుడు

పక్కగదిలో వింటున్న రాఘవేంద్ర ఎగిరి గంతు వేయబోయి తమాయించుకున్నాడు. మునసబు కరణాలు మంత్రముగ్ధుల్లా చెవులప్పగించి వినసాగాయి.

"ఆ మర్నాడు నేను చేసిన తప్పు గ్రహించుకున్నాను. ఆమె నిర్దోషిత్వం నన్ను క్రుంగదీసింది. నేను దోషిని అయ్యాను. పాపిని అయ్యాను. హంతకుణ్ణి అయ్యాను. ఒకనాటి రాత్రి కలలో....నా సుగుణ కనబడి.....నన్నుచూసి నవ్వింది....నవ్వుతూ "ఏపాపం ఎరుగని, అమాయకురాలనైన, మిమ్మల్నే నమ్మి పూజిస్తున్న నన్ను. — ఆదమరచి, మిమ్మల్ని నమ్మి నిద్రపోతున్న సమయంలో అంతం చేశారు. జీవితంలో యింకా అడుగుపెట్ట

---

ఇద్దరు జేబుదొంగలు నడచివెళ్తున్నారు. అంతలో ఒకడు మాటిమాటికి తన గడియారం చూచుకోవటము ప్రారంభించాడు. కొంత దూరంపోయాక తిరిగి జేబులోనుండి గడియారం తీసి చూడసాగాడు. ఇది చూసి రెండవ జేబుదొంగ "ఎందుకలా" చూస్తున్నావని అడిగాడు. దానికి మొదటి జేబుదొంగ సమాధానమిస్తూ "అది జేబులో వుందో, పోయిందో చూచుకుంటున్నాను" అన్నాడు.

జి. ప్రసాదరావు (విజయనగరం)

---

బోతున్న పాపను, కొత్త జీవితంలోకి అడుగు పెట్టబోతున్న నన్ను అంతం చేశారు....మీరు 'ఆ జీవితాంతం' ఆజీవితాంతమే' లేకుండా ఉండిపోతారు. మీకు చావు అనేది ఉండదు, చిరంజీవిగా ఉంటూ జీవితంలోఉండే కాఠిన్యాన్ని చవిచూస్తూ, నిత్య యువ్వనంతో అలాగే ఉంటారు....మిమ్మల్ని నమ్మి, ప్రేమించి, త్యాగం చేయగలిగిన స్త్రీ మీకు దొరికే వరకూ అంతే....అంతే....అంతే...

"అంతే.....ఆమె మాయమయిపోయింది"

మృత్యుంజయుడు తల ఎత్తి చూశాడు. టేబులు మీద కూర్చుని వింటున్న సుగుణ నేలమీద పడిపోయింది. ఎడమ చేత్తో నేలను ఆధారంగా చేసుకుని లేవడానికి చేసే ప్రయత్నంలో కొయ్యబారిపోయింది. ఆ దృశ్యానికి మృత్యుంజయుడు ఏమీ కలవరపడలేదు......సరికదా అసలు కదలనుకూడా కదలలేదు. సుగుణ కుడిచేత్తో తల పట్టుకుని' అబ్బ" అంది. మృత్యుంజయుడు నిశ్చలంగా ఆమెకేసి చూశాడు.

"ఇది......ఇది....వెయ్యి సంవత్సరాలనాటి సంఘటన.....ఆనాటినుండి నేను యిలా చిరాయువుగా ఉండిపోయాను......."

ఆమె మళ్ళీ అలా ఉండిపోయింది. మృత్యుంజయుని ముఖాన్న విషాదభరితమైన చిరునవ్వు వెలిగింది. అతనుకూడా చైతన్యహీనుడు అయ్యాడు.

పక్క గదిలో వింటున్న రాఘవేంద్ర 'ఆమె చచ్చిపోయింది' అని గొణిగాడు. ఆశ్చర్యంతో మునసబు కరణాలూ అవే మాటలు ఉచ్చరించారు.

"అబ్బా" అంది మళ్ళీ సుగుణ నుదురు నొక్కుకుంటూ. అయితే ఈసారి మృత్యుంజయుడు ఆశ్చర్యపడ్డాడు. ఆమె చావలేదు!!

"ఆమె చావలేదు!" అన్నాడు రాఘవేంద్ర ఆయాసంతో. 'అవును' అన్నారు వారిరువురూ.

సుగుణ నెమ్మదిగా లేచి పైట సరిచేసుకుంటూ నించుంది. ఆశ్చర్యంతో మృత్యుంజయుడు అలాగే ఉండిపోయాడు. అతని అవయవాలకు చైతన్యం పోయినట్లయిపోయింది.

సుగుణ కళ్ళు వేయి సూర్యుల కాంతితో మెరవసాగాయి. ముఖం ఎర్రగా కందిపోయింది. "అవును... అవును.....ఆ సుగుణనే నేను......నా ఘోష శాపంగా మారి మిమ్మల్నింత హింసిస్తుందనుకోలేదు.... నన్ను మన్నించండి. మళ్ళా దైవవశాత్తు మీ ఆఖరుభార్యనై నేనే పుట్టాను ..... నా జన్మ తరించింది.....

"పూనకం!" అన్నాడు మునసబు నెమ్మదిగా కరణంతో. "కాదు అలాటిదే......"హిప్నాటిజం" అన్నాడు రాఘవేంద్ర వీలైనంత నెమ్మదిగా.

......నా జన్మ తరించింది" అన్న సుగుణ నిలువునా నేల కూలిపోయింది. అదే క్షణంలో మృత్యుంజయుడు "ముక్తి—విముక్తి" అని అరిచాడు తను నించున్న చోటునుండి కదలకుండానే...

"రండి....." అంటూ రాఘవేంద్ర గది ఇవతలకు దూకి మృత్యుంజయుడి గదివైపు ఎగిరి దూకాడు. తలుపులు వేసి ఉండడంవల్ల ముగ్గురూ నాలుగు తాపులు తన్నారు. తలుపులు విడ్డాయి. ఎదురుగా రూములో సుగుణ బోర్లగిల్లా నేలమీద పడి ఉంది. "ఇద్దరూ పోయారా" అన్నాడు వెర్రెత్తినట్లు అరుస్తూ కరణం. రాఘవేంద్ర లోపలికి పరిగెత్తాడు.

"మృత్యుంజయుడు ఏడి?" అన్నాడు కరణం రూమంతా కళ్ళతో వెతికేసి. 'ఏమో!' అన్నాడు మునసబు.

"ఇడిగో" అన్నాడు రాఘవేంద్ర. అటు చూసిన వారిద్దరూ ఆశ్చర్యంతో "ఇదా? ఈమసి?" అన్నారు గదిలో ఉన్న మసికుప్పను చూస్తూ...

"అవును.....అతనికి విముక్తి అయ్యింది...... అన్నాడు రాఘవేంద్ర మోకాళ్ళ మీద కూర్చుంటూ

"మరి ఆమె?" అన్నాడు అనుమానంగా కరణం.

"..... కోలుకుంటుంది" అన్నాడు రాఘవేంద్ర ఆ 'మసి'కేసే చూస్తూ. ★